ప్రాణకతే ఒకటి జరిగింది.

అలాంటి కథలు చుట్టూతా అనేక మార్లు జరిగినా, అలాంటివి బోలెడు జరిగినట్టు బోలెడు మంది బోలెడన్ని కథలు రాసినా మళ్ళీ అలాంటి కథ జరిగింది.

ఒక అమ్మాయికి నెల తప్పింది.

అందుకు కారకుడైన అబ్బాయితో ఆ విషయం చెప్పి సిగ్గుపడింది.

"అయితే, నా కథ కింతటితో ఫుల్ స్టాప్ పెట్టేస్తున్నాను. మిగతా కథ ఎలా ముగింపాలో ఏ తంటా లేదో నీవే పడు." అనేసి తోక ముడిచే వాడా అబ్బాయి

ఎన్నో కథలు కన్నా, విన్నా, చదివినా, తన విషయంలో ఇలా జరుగుతుందనుకోలే దా అమ్మాయి.

జరిగింది.

జరిగినందుకు విచారించడం లే దా అమ్మాయి.

ఎందు కిలా జరిగిందని ఆలోచిస్తూంది.

నమ్మినందుకా? — కాదు. అతడే నమ్మించాడు.

తొందరపడినందుకా? — తనా తొందరపడింది? తానే — "ఒద్దొద్దు, తప్పు, పెళ్ళి, ముళ్ళు, ఏదైనా ప్రమాదం" అంటున్నా అతనే బ్రతిమాలి, మురిపించి, మరిపించి, అలిగి, మూతి ముడిచి, కవ్వించి, నవ్వించి, మెప్పించి ఒప్పించ లేదూ!

పాతబడిపోయానా? అబద్ధం— జీవితాంతం అంటిపెట్టుకు ఉండే పెళ్ళాలు పాతబడుతున్నారా?

ఇప్పు డిలా అయినందుకా? — కాదా, మరి?

అయితే, పెళ్ళి చేసుకో వచ్చుగా? పెద్దలు ఒప్పుకోరా? ఒప్పుకుంటూ రన్నాడుగా? ఒప్పిస్తానని కూడా అన్నాడు. మరి ... మరి ... మరి?

అయినా, తనదే తప్పు.

ఇలా జరుగుతుందని తెలిసినా జరగ నిచ్చుకోవడం తప్పు.

అయితే, ఎంతోమంది కాకపోతే కొందరైనా ఇలా చేసిన వాళ్ళూ, అందరూ కాక పోయినా కొందరైనా ఇలాచేస్తున్న వాళ్ళూ, ఇన్నిన్ని జరిగినా కొంతలో కొంత మందైనా ఇలా చేయబోయే వాళ్ళూ ఉన్నారుగా! తప్పు—తప్పనుకుంటూనే చేసి, చేస్తూ, చేయబోతున్నా రంటే ఎక్కడుంది లోసుగు?

వయస్సులో ఉన్న ఆడపిల్లలు నవ నవలాడ్డం తప్పా?

మూనాగు విసాల గాయుళ్ళు వాళ్ళ వెనకబడి తారట్లాడ్డంలో తప్పులేదా?

నేను ఏయన్నార్నని ఒకడూ, నేను ఎన్టీఆర్నని ఇంకొకడూ; బుద్ధిమంతుణ్ణని ఒకడూ, సోగ్గాణ్ణని మరొకడూ; ఒలింపియన్‌నని ఒకడూ, హెర్క్యులెస్ నని ఇంకొకడూ, కోతి, కొండముచ్చూ కూడా ప్రదర్శన లివ్వవచ్చా?

'నన్నుచూడు, నేన్నేను, నే నచ్చలేనా?' అంటూ చుట్టూ తిరిగే వందమందిలో ఎందుకో ఒకందుకు ఎవడో ఒకడు నచ్చడం తప్పా? పెళ్ళి చూపులో నైతే అంబోతు నచ్చినా, సింబోతు నచ్చినా నచ్చలేదంటే ఊరుకుంటారా? నచ్చాలి. ఎందుకు నచ్చడు? అతనికేం, కాలు వంకరా? కన్ను గుడ్డిదా?' అని అడగడం లేదా!

ఎవడో ఒకడు నచ్చాడే అనుకో. నచ్చాడని అనుకోగానే సిగ్గు ముంచుకు రావాలా? అతణ్ణి చూడ్డానికి కళ్ళు వాలి పోయి ముసి ముసి నవ్వులు రావాలా? అదేమిటో, అతడు బదులు నవ్వగానే వెనకా ముందూ తెలుసుకోకుండా ప్రేమ పుట్టుకు వచ్చేయడం! ఇదంతా ఎవరి తప్పు?

అతనుమాత్రం ఆ క్షణంలోనే పుట్టుకు వచ్చిందంటూ మర్నాడే చీటీ రాయలేదూ?

నా రాణీ, ఇంద్రాణీ, చంద్రమతీ, నా సావిత్రీ, ఓహో రంభా, ఓహో హో ఊర్వశీ అని ఇంకేంకేమో అందులోనే అతగాడు రాయలేదూ?

ఆ వెనకనే గదా ఇలా జరిగింది!

ఇదంతా నా తప్పా?

అతని తప్పా?

ఇదంతా ప్రకృతి కాదా?

అయితే, ఇదంతా ప్రకృతి తప్పా?

ప్రకృతిలో తప్పులుంటాయా?

కానప్పుడు ఇప్పుడేం తప్పు జరిగి పోయిందని అతగా డిలా ప్రవర్తించాలి? ఎక్కడుందంటే వికృతి? ఎక్కడుంది దాని కీలు? ఇన్నాళ్ళూ దాని కీలెరిగి వాత పెట్ట గలిగిన వారే లేరా?

లేరు! లేరు! లేరు!

కనకనే ఇలా గయింది.

అయితే ముగింపు?

మందా? నో, నో.

గొయ్యా? నోర్ముయ్యి.

ఉరి. ఉహూఁ హూఁ.

ఎండ్రిన్? హోల్డాన్.

రైలా? — ఛి, ఛీ.

విష? హెల్.

కిరసనాయిలు డబ్బా? ఎందుకబ్బా?

మరి? ... మరి? ... మరి? ...

* * *

"అమ్మా! మరి ... మరి ... మరేమో ..." గారాబం ఒలికించ బోయింది రాధ.

బెండకాయ తరుగుతున్న అనసూయమ్మ—"ఏవిటే, తల్లీ?" అని అడిగింది.

"అదేనే. నాకు నెల తప్పింది." అని చిరునవ్వు నవ్వి సిగ్గు పడింది రాధ.

యశోదమ్మలా నోరు తెరిచింది అనసూయమ్మ.

పద్యం పాడ్లేదు.

దండకం మొదలు పెట్టింది. "ఏ వన్నావే? అవ్వా, అవ్వా, అవ్వా—దెష్టా, ముండా, భడవా, అయ్యయ్యో, అయ్యో, అయ్యో" అంటూ మొట్ట మొట్టింది కూతుర్ని.

"మనవడో, మనవరాలో అని మురిసి పోతా ననుకుంటే అలా మొట్టుతా వేమిటే?" అని మరీ గారాబం ఒలికించింది రాధ.

"అయ్యో, రామా! సిగ్గాని పిచ్చెక్కిం దేమిటే? అరవకే, తల్లీ. ఆయన గారు విన్నాడంటే! అమ్మో! నాయనో! ఇప్పు డేం జేద్దునో దేవుడోయ్." ముక్కు చీదేసి నెత్తిన చేతులు పెట్టేసుకుంది అనసూయమ్మ.

"నాన్నా ... నాన్నా ..." కేకేసింది రాధ.

"కొంప అంటించకే, ముండా! ఆయన గారు వచ్చాడంటే విన్నా, నన్నూ నరికి

జైరాజ్

పోగులెడతాడే." గాభరాపడిపోతూంది అనసూయమ్మ.

"కత్తి రెడీగా చేత బుచ్చుకు రాడు లేవే. భయం లేదు. భయపడకు ... న్నాన్నా ... నాన్నా ..." మళ్ళీ కేకేసింది రాధ.

"ఏ మయ్యో గొయ్యో చూసుకో వలసింది పోయి ఇలా పేట్రేగి పోతున్నా వేమిటే తల్లోయ్!" అని నెత్తి బాదు కుంటూంది అనసూయమ్మ.

"చచ్చి ఎవర్ని సాధించ మంటావే, అమ్మా?" అని నవ్వుతూంది రాధ.

వంటింటి గుమ్మంలోకి వచ్చిన ప్రసాదరావు, "ఏవిటమ్మా, రాధా?" అడిగాడు.

"అమ్మకేవిటో పిచ్చెక్కిన ట్టుంది, న్నాన్నా ..."

"హామ్మో. హామ్మో ... ఎక్కిం దండీ పిచ్చి ... ఎక్కిపోతూంది ..." అని గుండెలు బాదుకుంది అనసూయమ్మ.

"అనసూయా...అనసూయా! ఏమిటమ్మా, రాధ, అసలేం జరిగింది?"

"చెప్పవే, అమ్మా! అలా పిలిస్తే పలక వేమిటే? నువ్వు చెబుతానని గదూ, నాన్నగార్ని పిలుస్తా. అదేవిటో, బాబూ! శుభవార్త లయినా నాన్నగారితో చెప్పాలంటే ఏవిటో, బాబూ, నాకు సిగ్గుగా ఉంది" అని సిగ్గుపడింది రాధ.

"అదేవిటమ్మా? ఇందా కేదో చావు అన్నట్టు వినపడింది. ఇప్పు డేదో శుభవా ర్తంటున్నావ్. చెప్పు చెప్పమ."

"చెప్పమట చెప్పవే, అమ్మా!"

"ఏమిటే, అనసూయా?"

"ఏమని చెప్పేది, దేవుడోయ్! ఏమండీ! దానికి మతి భ్రమించిందండీ ... కొంప అంటుకు పోయిందండీ ..."

"అదేదో శుభవా ర్తంటుంటే, ఏ వేమిటే ఇలాగ?"

"శుభవార్తా, నా శ్రాద్ధమా? ఘోరం జరిగిపోయిందండీ."

"ఏమన్నావ్? ఘోరమా? ... అయితే, నీవు నాలుగు ఘోరాలు చేశావంటే అమ్మా? ... అప్పయ్య ... నేను ... చిన్ని ... వంటి ..."

"అనుమానం లేదు. దీనికి వెర్రి ముదిరి పోయిందండోయ్!"

"వెర్రది నువ్వూ, పిచ్చిది అదీ... ఏవిటే అసలు సంగతి? మధ్యన నేను చస్తున్నాను."

"చెప్పేయ్యమంటావే, అమ్మా?"

"అది చెప్పినా చెప్పొస్తుంది. మీరు మాత్రం తొందరపడకండీ, బాబోయ్! దాని మతి మతిలో లేదు, నాయనోయ్!"

"ఏం లేదు, నాన్నా, నీవు తాతవి కాబోతున్నావు?"

"రాధా!" త్రుళ్ళిపడిపోయాడు ప్రసాదరావు.

"ఏవం డేవండీ ..." అంటూ అతని కాళ్ళు పట్టేసుకుంది అనసూయమ్మ.

"పెంకు లెగిరిపోయేలాగా అలా గావు కేక పెట్టావేమిటే, నాన్నా, నే నెదురు గుండా ఉంటేనూ!? ఏవేమిటే, అమ్మా, నీకు పిచ్చి ముదిరి పోలేదా?"

"సందేహం లేదు—నా తల్లి, పిచ్చిది పోయిందండోయ్!" అని గట్టిగా ఏడ్చేసింది అనసూయమ్మ.

"అమ్మా రాధా?" ఈ మాటు ప్రసాదరావు కంఠం వణికింది.

"అదా సంగతి? సంతోషం పట్టలేక ఇందాకా అలా అరిచావా నాన్నా? ... మరి నీమతం?"

"పోయిందండీ పోయింది! దానికి ఉన్నమతి కూడా పోయింది."

"ఎంత ఘోరం జరిగిపోయిందమ్మా, రాధా ..." అని బాధపడిపోయాడు ప్రసాదరావు.

"ఘోరమేమిటి, నాన్నా?"

"నీ కిప్పు డెలా తెలుస్తుందే, తల్లి? పెళ్ళి పెటాకులూ లేకుండా తల్లివి కాబోతున్నావని సంబరపడిపోయే పిచ్చి దానివి."

"ఓహో! కంఠంలో పోస్తే గాని తీర్థం కాదంటారా?"

"భగవాన్, నా కెందుకీ శిక్ష విధించావు? అన్నం పున్నెం ఎరుగని అమాయకురాలు రాధకు ఈ దుస్థితి ఎందుకు కలిగించావు?" అని ఎదురుగా ఉన్నాడనుకొని దేవుణ్ణి ప్రశ్నిస్తున్నాడు ప్రసాదరావు.

ఈ గొడవ ఆలకించిన రాంగోపాల్ — సిగిట చేతో ఆగలు గొంగాని వంట గది లోకి వచ్చి, "ఏమిటమ్మా, ఏం జరిగింది?" అని అడిగాడు.

"రారా, అప్పయ్యా, రా. చూడ్రా పిళ్ళందుకా. మన తల్లిని కాపోతున్నావంతే!"

"రాధా!" అని కేకపెట్టి, ఉద్రిక్తుడై పోయి చెయ్యెత్తి కొట్టడాని కన్నట్టు మీదిమీదికి వెళ్ళాడు రాంగోపాల్.

"ఒరేయ్ అబ్బాయ్! దించు. ఆ చెయ్యి దించు. నీ ఎట్రా నన్ను కొట్టేవాడివి?"

కుమారుణ్ణి అడ్డుకొని, "అది మనలో లేదురా, బాబూ, దాని జోలి కెళ్ళకు" అన్నాడు ప్రసాదరావు.

అదేమీ పట్టించుకోకుండా—"చంపేస్తాను ముండని" అన్నాడు రాంగోపాల్.

"అయితే, వేస్తాను నీ మెడ కొక తాడు—" నవ్వింది రాధ.

"దానిమాటలకేం గాని, బాబూ! మన పరువు ఎట్టాగో కలియక ముందే వీధి బజారు పాల్జేయకండి. ముందు కర్తవ్య మేమిటో ఆలోచించండి" అన్నది అనసూయమ్మ.

"ఇప్పుడేం చెయ్యమంటావే? నెత్తిన చెంగే" అని నిట్టూర్చాడు ప్రసాదరావు.

"అలాగంటే ఎలా గండీ? వా డెవడో అడిగి తెలుసుకోండి. వాడి కాళ్ళు పట్టుకుందాం. మన అవసరం."

"ఇప్పుడీ పిచ్చిదానితో అదిమాత్రం సాధ్యమటే?"

"పిచ్చా? నాటకమా? ... ఎవడే వాడు?" గద్దించాడు రాంగోపాల్.

"నాటకం, ఇంకా నయం. బూటక మన్నావు గాదు. రెండో నెల అని నిజం చెబుతూంటే నాటకమంటావేమిట్రా?" ఎదురు ప్రశ్న వేసింది రాధ.

"ఛీ నోర్ముయ్! ఎవడే వాడు?"

"ఏం, ఏంజేస్తావేం వాణ్ణి?"

"ఎముకలు విరిచేసి, రెక్కలు విరగ్గొట్టి తెచ్చి నీ కాళ్ళ ముందు పడేస్తాను."

"నీ ఎముకలు వాడు చూర్ణం చేస్తేనో?"

"రాధా!"

"ఎందు కా బాధ?"

"బాబూ రాముం! నా దెవడో వాణ్ణి చెప్పడం కాదుగా జరగవలసిన కార్యక్రమం. నువ్వుండు. ఊరుకో. అమ్మా రాధా! ఎవడమ్మా వాడు?" అడిగాడు ప్రసాదరావు.

"ఎందుకులే, నాన్నా! వాడు నే నక్కర్లే దని నాతో ఖుద్దున చెప్పాక."

"అంటాడంటాడు. వాడి చర్మం ఒలిచేస్తాను. ఎవడే వాడు," కలగజేసు కున్నాడు రాంగోపాల్.

"ఒలవరా, బాబూ! నా చర్మం ఒలిచి నీకు చెప్పులు కుట్టిస్తాను."




"నువ్వూరుకోరా, నాయనా! ఎవడే, తల్లీ వాడు—పేరు చెప్పవమ్మా?" బుజ్జగించింది అనసూయమ్మ.

"ఎందుకులే, అమ్మా వాడు వద్దన్నాక."

"ఎందుకంటే ఎలాగమ్మా? వాడి కాళ్ళా, గడ్డం నేను పుచ్చుకుంటాను. లేకుంటే మన పరువు గంగలో కలిసి పోదూ?"

"అందులో పడి మన బంగారం కరిగి పోతుందా? మన సామగ్రి కొట్టుకు పోతుందా? మన ఇళ్ళూ, పొలాలూ కొట్టుకు పోతాయా?"

"ఏమిటమ్మా, రాధా, నీ వ్యాపేది? పరువమ్మా పరువు." అన్నాడు ప్రసాదరావు.

"అది అందరికీ ఉంటుందా, నాన్నా?"

"ఎందుకుండదమ్మా?"

"ఏరా, అబ్బాయ్, నిజమేనా?"

"నోర్ముయ్యవే. నా దెవడో [illegible]

ముఖంతో ఈ డొంక తిరుగుళ్ళేమిటి?" కసిరాడు రాంగోపాల్.

"నీ వెందుకు డొంక తిట్టుకు తిరగాల్లేరా! నీ ఫ్రెండు శివాజీ లేడూ? వాడు?"

"శివాజీ! ద్రోహి!" పటపట పళ్ళు నూరాడు రాంగోపాల్.

"శివాజీనా?" ఆశ్చర్యపోయాడు ప్రసాదరావు.

"శివాజీనా?" గొణిగింది అనసూయమ్మ.

"నీకేం ద్రోహం చేశాడురా, శివాజీ?" అడిగింది రాధ.

"ఇంతకన్నా ద్రోహం ఇంకేం కావాలే? కులం తక్కువ వెధవ."

"ఎక్కువైతే ఫరవాలేకపోయేదా?"

"ఎక్కువ, తక్కువలన్నీ తేడా లేదే, తల్లీ! ఒక్కటి కాకపోవడమే ఒక లోసుగు" అన్నది అనసూయమ్మ.

"మనుష్యులంతా ఒక్కటి గాదా, నాన్నా?"

"కొత్తరమ్మా కొత్తారు. నీ లాంటి విద్యాధికులు ఇంటి కొకరుంటే నీ వాదే అయ్యే వాళ్ళు." నవ్విగా అన్నాడు ప్రసాదరావు.

"దాని పిచ్చి ప్రశ్నలతోను, మీ పొంతనలేని సమాధానాలతోను కాలం వృథా చేస్తే ఎలాగండీ? నాయనా రాముం, మనవాళ్ళి ఆ శివాజీ దగ్గర భంగపడరా. కాళ్ళే పట్టుకుంటావో, గడ్డమే పట్టుకుంటావో వాణ్ణి మాత్రం ఒప్పించు. నీ అన్నవరం గుళ్ళోనో ఆ మూడుముళ్ళూ వేయించేద్దాం. గుడ్డిలో మెల్లలా నలుగురూ నవ్వక ముందే ఏదో ఒక దారి చూడు."

"ఏ మొహం పెట్టుకెళ్ళమంటావే?" ఉరిమాడు రాంగోపాల్.

"ఏడుపు ముహం పెట్టుకెళ్ళమని చెబుతూనే ఉంది గదురా అమ్మ. నీకు తప్పకపోతే చీర మొహం పెట్టుకెళ్ళు పోనీ." నవ్వింది రాధ.

"సిగ్గు పడి ముడుచుకు చావవలసింది పోయి, ఏమిటే నీ పేలుడు?" [illegible] పడ్డాడు రాంగోపాల్.

"వెనకటి రోజులు కావురోయ్, అన్నాయ్? ఆ మూడింట్లో ఏదీ చేయను. పెంచగ్గా సింగారించుకుని వీథిలోకి వెళ్ళి చెప్పుకు తిరుగుతాను, ఏమన్నావో?"

"ఏమండీ ఈవేళ అమావాస్యా?"

"కొంచెం మబ్బు చాటు వచ్చిందని పున్నమిని పట్టుకుని అమావాస్య చెయ్యకే, అమ్మా. కొంత నేపాగు. అంతా పిండార బోసినట్టు వెన్నెలే!"

"అమ్మా రాధా?" ఆందోళన ధ్వనించింది ప్రసాదరావు కంఠంలో.

"నువ్వూ నాకు పిచ్చి అనుకుంటున్నావా, నాన్నా?"

"ఎందు కనుకోదే? నన్నడిగితే మద పిచ్చంటాను." రాంగోపాల్ జవాబిచ్చాడు.

"నువ్వూరుకోరా. ఇంతకీ ఆ శివాజీ ఏమన్నాడో చెప్పమ్మా?" బుజ్జగించాడు ప్రసాదరావు.

"నా రాణీ, ఇంద్రాణీ. . ."

"అవన్నీ ఇప్పుడెందుకే? వినకూడని కాదో ఒదేయ్." అడ్డు తగిలాడు రాంగోపాల్.

"నా దేవ్వా జీవిత్రా, నే నేదన దానికి? నువ్వు ఊపే చెప్పాడు ఈ కథ కింతటితో ఫుల్‌స్టాప్ అని. ఫుల్‌స్టాపట ఫుల్‌స్టాపు. . ." అని విరగబడి నవ్వింది రాధ.

"ఏమండోయండీ! ముందు డాక్టర్ని ఎవర్నయినా పిలిపిద్దురూ!" కంగారు పడుతూ చెప్పింది అనసూయమ్మ.

"నేను ఎబార్షనుకి ఒప్పుకోనే, అమ్మా!"

"అదన్నదీ ఒక మంచి మాటేనండీ. పెళ్ళయితే పిచ్చి కుదురుతుం దంటారు. పోనీ అదైనా చేసి చూద్దామండీ" అన్నది అనసూయమ్మ.

"పెళ్ళి చేస్తావా, అమ్మా! అయితే చెయ్. వెళ్ళి ఆ శివాజీ వాళ్ళ అమ్మా బాబుల కాళ్ళట్టుకో. నా భర్త అంటే శివాజీ కాదనడు."

"నా భర్తా అనరు? సభ్యులెవ గొడతారు" అన్నాడు రాంగోపాల్.

"ఎవరిని?" నవ్వింది రాధ.

"నిన్ను, నాన్న, నిన్నున వాళ్ళందరినీను."

"ఏం? వాళ్ళ కాడపిల్లల్లేరా?"

"ఉంటే? వాళ్ళూ నీలాటి వాళ్ళే అనుకున్నావా?"

"కాకపోతే వాళ్ళేప్పుకో లేమిటి, నాన్నా?"

"తనదాకా వస్తే గదమ్మా, ఎవరికైనా అందులోని బాధ తెలిసేది." అన్నాడు ప్రసాదరావు.

"ఎవ రింట్లో ఇలా జరిగినా వాళ్ళు వాళ్ళంతా మీలాగే బాధపడతారా, నాన్నా?"

"బాధా? ... నరకమూ?"

"దా న్నెవరైనా స్వర్గం చేసేస్తే ఎంత బాగుణ్ణు!" నవ్వింది రాధ.

"అది పేరాశమ్మా. దేవుడికి కూడా సాధ్యపడదు."

"దేవుడి మాట నా దగ్గ రెత్తకండి గాని, అన్నయ్యకి సాధ్యపడుతుంది. ఏరా, అన్నాయ్?"

"వాడి చేతిలో ఏముందని?" అన్నది అనసూయమ్మ.

"వాడి చేతిలో ఏముందో నే నెరగను గాని, వాడి గుండెల్లో సిరికి ఉంది. మీరూ ఊ(అంటారో, అనరో అనే భయమున్నది. మాట్లాడవేరా, అన్నాయ్?"

"గొప్ప ధైర్యమైన పని నివుగాక చేసుకొచ్చావని."

"పోనీ ఈ స్వేచ్ఛైనా శుభకార్యం చేశావా? అది చెప్పు."

"నేనా? ... నీలాగునా?"

"ఒకే ఉష్ట్ర పక్షి! ఇందిర ఇటుక కాదురా—మనిషి."

"రాధా!"

"యస్. ఇంది రంటుంటే రాధని టాక్!" అని పెదవి కరిచిపెట్టి గుడ్లు తిప్పి, "ఇంత అరుస్తుంటే నీకు ఇందిర సంగతే గుర్తుకు రాలేదట్రా?"

"ఇందిర నీ కెలా తెలుసు?" గాభరా పడిపోయాడు రాంగోపాల్.

"మధ్యలో ఈ ఇంది రెవరమ్మా?" అని ప్రసాదరావు, అనసూయమ్మలు ఇద్దరూ అడిగారు.

"ఏరా, అన్నాయ్, ఇందిర ఎవరటా?"

"ఎవరో అవన్నీ ఇప్పు డెందుగ్గాని, అది నీలాంటి ఒక దెయ్యం."

"నివు ఆ శివాజీ లాంటి ఒక భ్రష్టుడివి కనక."

"ఏమిటి, తల్లీ రాధా, ఇదంతా?" అడిగాడు ప్రసాదరావు.

"ఇంకా ఏమిటో అర్థంగాలాదే, నాన్నా? ఇందిర ఒక క్రిస్టియ న్నమ్మాయి. వాడి క్లాస్‌మేటు. ఇదుగో అదుగో అని బులిపించి ఏది చేయకూడదో అది చేసి ఫుల్‌స్టాపట, ఫుల్‌స్టాప్—అది పెళ్ళి కాదు. ఆ అమ్మాయికి ఏ దారీ దొరక్క నన్ను వెదుక్కు వచ్చి సాటి ఆడదాని నమ్మా, నమకానిదాన్ని, సమవయస్కురాలిని—అర్థం చేసుకోగలనని నీతో చెప్పుకుం టున్నాను. అని చెప్పుకుని ఏడ్చింది. అంతకన్నా ఏం చెయ్యగలదు? ఏరా, కాదా?"

"మాట్లాడవేరా, రాముం! నిజమేనా?" గద్దించి అడిగాడు ప్రసాదరావు.

"ఆ అమ్మాయి క్రిస్టియనని, మీరొప్పుకోరని ..." నసిగాడు రాంగోపాల్.

"వాడి మాటకేం వచ్చిందండీ? మగ మహారాజు. నా దెంజేసినా చెల్లిపోతుంది. ముందు దీనిమాటేమిటటా? ముందదీ అండీ" అని దీర్ఘం తీసింది, రెండు సమస్య లెదురయ్యేసరికి అనసూయమ్మ.

"ఆ మాట నిజమేనే, అమ్మా! నే ననుకున్నట్టు నాది మతి తప్పలేదు, నేను తప్పలేదు. ఆ శివాజీ పాపం భ్రష్టుడూ కాదు. నీ పాపమూ ఎరుగడు. నే నతన్ని ప్రేమించనూ లేదు. మీదాకా వస్తేగాని మరొకరి బాధ మీరు తెలుసుకోలేని మనుష్యులని మీ సంగతి నాకు బాగా తెలుసు గనక, ఏదో ఒక నాటకం ఆడి మీ నాకా చెప్పాను. అంతే" అన్నది రాధ.

"అమ్మా రాధా!" అన్నాడు ప్రసాదరావు ఆశ్చర్యంగా.

"ఏడుకొండలవాడా, వెంకటరమణా" అని భక్తి ప్రపత్తులతో దణ్ణంపెట్టేసు కుంటూంది అనసూయమ్మ.

"నీ బాధ తీరిందని దేవుడికి దణ్ణం పెట్టుకోవడంలో లేదమ్మా స్వర్గం. ఇతరుల బాధ నీ బాధ లాంటిదేనని గుర్తించి ఆ ఇందిరను కోడలుగా తెచ్చుకో. ఏం, నాన్నా? దేవుడికి కూడా సాధ్యపడ దన్నావే, అవతలి ఇంటివాళ్ళ నరకాన్ని స్వర్గం చెయలేమా? ఏరా, అన్నాయ్, ఇప్పు డది నీ చేతిలో లేదూ!?" అడిగింది రాధ.

• • •

"కలా? వైష్ణవమాయా?" అనుకుంది ఇందిర తన చెవులను తాను నమ్మలేక.

"కాదు. టాప్ సీక్రెట్" అన్నాడు రాంగోపాల్. ★

---

**జయాపజయాలు**

ప్రజాస్వామ్యం ఎప్పుడూ అపజయం పొందదు. ప్రజల సమస్యలను నేతలు సరిగా అర్థం చేసుకుని పరిష్కరించలేక, దానిని అపజయంగా ప్రచారం చేస్తారు.

—హెచ్స్

• • •

**కారణం**

ప్రపంచంలోని అనేక క్రౌర్యాలకు కారణం మద్యపానం! నేరం చేసేవాళ్ళు చాలామంది తాగి మరీ ఆ పని చేస్తారు.

—క్రార్క్